

# ముక్తలోక

మరువాడ రాజేశ్వరరావు

"ఒక విల్స్ పేకెట్" అంటూ రూపాయి నోటు విసిరేడు రాంబాబు.

తెల్లని ఇస్త్రీ బట్టల్లో తళతళ మెరుస్తున్నాడు. చదువు నేర్చుకోడానికి పట్నం వచ్చిన రాంబాబు జీతం కట్టడంతో ఆ బాధ్యత వదిలించుకుంటాడు. రోజుకున్నవే ఇరవై నాలుగ్గంటలు. అందులో సిగరెట్లు కాల్చడానికి, సినిమాలు చూడ్డానికి, ఇంటర్నేషనల్ హోటళ్ళలో 'హాట్ డ్రింక్స్' తాగడానికి, అమ్మాయిల్ని వేటాడ్డానికి వీలైతే వల్లో వేసుకోడానికే టైము చాలదు. పాపం! ఇంక చదువుకోడానికి తీరికెక్కడిది?

విల్స్ పేకెట్ జేబులో పెట్టుకుంటూ, కిళ్ళీ దుకాణం పక్కనే పెద్ద గొంతుచేసి దెబ్బలాడుకుంటున్న ఆడవాళ్ళ వేపు చూసేడు. ఇద్దరాడవాళ్ళు దెబ్బలాడుకుంటుంటే మరో అయిదారుగురు చూస్తూ నిలబడ్డారు.

ఇద్దరాడవాళ్ళ బట్టలూ మాసి చిరుగులు పట్టి పోయేయి. ఇద్దరికీ వొంటిమీద బట్ట సరిగా నిలవడంలేదు, పిడికిళ్లు బిగించిన చేతులు గాలిలో ఆడుతున్నాయి. మొహాలు ముందుకి వంచి గొంతు పగిలేలా అరుస్తున్నారు. తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకుంటున్నారు. ఒకరి దరిద్రాన్నొకరు ఎత్తి పొడుచుకున్నారు....

"నా కన్నేయం సేస్తే బగమంతుడు సెయ్యండదే....నన్ను మోసం సేసి నువ్వు మేళ్లు, మిద్దెలు కట్టసేవు!"

"నా నెవులికీ అన్నేయం సెయ్యేదు, సెయ్యను. నా కాడున్నప్పుడు నీది నీకెచ్చేస్త నన్నాను."

"నీ కాడెప్పు డుంటదే?........మూడు పూటలాయి నాకూ, నా పిల్లలికీ గంజి నీళ్లు నేవు. నా పైసాల్నొకొడేస్తే పిల్లలికి నాలుగు పుణుకులేనా కొందారంటే నన్ని లాగేడిపిస్తవేంవే—సంజా?"

రెండో మనిషి ఏమీ మాట్లాడలేదు. ఆమె తరపున ఇంకో కామె మాట్లాడింది.

"ఏటి సేస్తాం పూరుకోయే....దానికీ రెణ్ణాళ్ళించి కూడ్లేదు. దాని మొగుడికి బాగనేదు. ఇంటికాడే అద్ని కనిపెట్టుక్కూకుంది....దాన్నింక బాధపెట్ట కెలిపో, దానికాడున్నప్పుడిచ్చేస్త దెలిపో...."

ఒకరి మీదొకరు జాలిపడ్డానికి అవకాశం లేకపోయింది. ఒకరి కొకరు పంకుతనం, దొంగతనం ఆపాదించుకున్నారు. ఆ అరుపులు నాభిలో ఉడికి పేగుల్ని చీల్చుకొస్తున్నట్టుంది.

"నన్ను దుక్కపెడితే నువ్వు పురుగులడి సస్తావే," అంటే,

"నీకే వొస్తదే పెద్ద రోగం," అని, ఒకర్నొకరు శపించుకున్నారు.

ఆ తగువంతటికీ కారణం అయిదు పైసల్!

"ముష్టి అయిదు పైసల్ కోసం?.... ఓహో, ఓహో," అని నవ్వుకున్నాడు రాంబాబు.


అయిదు పైసలకోసం అంతఘోరంగా పోట్లాడుకోడంలో అతనికి 'సంస్కారం' కనిపించలేదు,—ఏడుపు శ్రావ్యంగా ఉండనట్టు; ఆకలి సుఖంగా అనిపించనట్టు!

సిగరెట్టు ముట్టించి ముందుకి నడిచేడు రాంబాబు.

ఎండ మండిపోతోంది.

'కర్ప్యూటికురా'లో ముంచిన రుమాలుతో మొహం ఓసారి అద్దుకున్నాడు.

ఓహ్....బూటుకాలు కింద నలిగిపోవలసిందే. వెంట్రుక వాసిలో తప్పించుకుని ఎదురు కళ్ళతో అతని వేపు చూసింది పిల్ల. నాలుగైదేళ్ళ వయసుండొచ్చు, బాన కడుపు, చీమిడి ముఖం, పుల్లలాంటి కాళ్ళు, చేతులు, వొంటినిండా మట్టి........'డర్టీ క్రీచర్' అనుకున్నాడు రాంబాబు. మనుషు




లింత అసహ్యంగా, దరిద్రం ఓడుతూ ఉంటారా అన్న ఆశ్చర్యం కూడా కలక్క పోలేదు.

ఆ వీధి యిరుగ్గా ఉంది. వీధినిండా చెత్త, చెదారం. ఒక పక్క మురిక్కాలవ. అందులో పంది కూనలు ఆడుకుంటుంటే కంపుకొడుతోంది.

రెండు వేపులా వ్యాపించిన కమ్మలిళ్లు. ఇంటికీ, ఇంటికీ మధ్య ఒక మనిషి మాత్రం పోగల చిన్న సందులు.

ఎండకి వేగిపోయి వాడిపోయిన కమ్మలిళ్లల్లో, తాపానికి దహించుకుపోయి వాళ్లు మరచి నిద్రపోతున్న ఆడవాళ్లు, పిల్లలు....

తలుపులు, గొళ్ళేలు లేని యిళ్లు.

దాచుకోవానికేం వుంది కనక. వాళ్ళదైన శ్రమకే దిక్కులేనప్పుడు....కడుపు నిండా తిండేనా లేని వాళ్ళకి!

ఆ ఎండలో, ఆ సందులోంచి వెళ్ళే అవసరం రాంబాబు లాంటి వాళ్ళ కసలు తరచుగా రానేరాదు. వాళ్ళకోసం వేరే పెద్ద పెద్ద వీధులున్నాయి ...లాభం లేనిదే ఏ పనీ చెయ్యరు వాళ్లు. లాభాలంటే ఎరగని వాళ్ళతో కూడా అవసరాలుంటాయి— లాభాలు గడించగలనేర్పున్న వాళ్ళకి.

సుందరమ్మ మొగుడు డ్యూటీకి పోతా డని అతనికి తెలుసు. ఆమె ఆ క్షణాన అతని కోసం ఎదురు చూస్తూంటుందనీ తెలుసు. ఏదో మధుర స్మృతిలో చిన్నగా నవ్వుకున్నాడు.

నున్నని బుగ్గలు....పచ్చని శరీరం .. కాటుక కళ్లు....కళ్ళకద్దుకట్టినట్టగుపించేయి!

తను చేసే ప్రతి చిన్న చిలిపి చేష్టకీ పకపకా నవ్వుతుంది సుందరమ్మ. ఆ నవ్వు గలగలా శబ్దం చేస్తుంది....ఆ నవ్వులోని

మాధుర్యం, అమాయకత్వం తలపుకొచ్చే యతనికి.

డబ్బు ప్రాతిపదిక మీద, కేవలం భౌతి కావసరాలు తీర్చుకునే నిమిత్తం ఏర్పరుచు కున్న సంబంధాలు సాధారణంగా మధుర స్మృతుల్ని రేపవు. ఒకవేళ కలిగినా,వాటికీ, ప్రేమవల్ల కలిగే స్మృతులకీ చాలా తేడా ఉంది.

పరధ్యానంగా ఆఖరిదమ్ములాగి బొటన వేలిమీద సిగరెట్టుంచి చూపుడు వేలుతో ఠపీమని కొట్టేడు రాంబాబు.

మరో పాతికడుగులు ముందుకి నడిచి కుడిచేతివేపు సందులోకి తిరిగేడు. కొంత దూరం నడిచి మళ్ళీ యెడంచేతి వేపు సందులోకి తిరిగేడు.

* *

ఆ వీధిలో రెండు మూడు డాబా యిళ్లు, నాలుగైదు పెంకుటిళ్లు, మిగతా పాకలు ఉన్నాయి. ఒక డాబా యింటి పక్కనే ఉన్న దారు లేని షెడ్డులో ఒక జంట కాపరంచేస్తున్నారు.

ఆ షెడ్డు దగ్గర చాలా జనం మూగి ఉన్నారు. షెడ్డు తలుపేసి ఉంది.

లోపల్నుంచి ఏడుపులు, ఇతర శబ్దాలు వినిపిస్తున్నాయి. తలుపు దగ్గర ముసిల్దొకతె నిలబడింది.

“సంపేకురా దాన్ని... సంపేకురా బాబూ” అని ప్రాధేయపడుతోంది ముసిల్ది.

లోపలేదో ధబీమన్న చప్పుడు ...తల గోడకి కొట్టుకున్న శబ్దం ..దాన్తో పాటే ‘అమ్మో అమ్మో’ అంటూ అరుపులు.

కుర్చీ ‘టక టక’ లాడిన శబ్దం.

వెనువెంటనే “అమ్మా ఆఁ” అన్న అరుపు.

“సంపేకురా ...” అంటూనే ఉంది ముసిల్ది దీనంగా.

ఆ యింటికి కొంత దూరంలో ఆగి పోయేడు రాంబాబు. సిగరెట్టు దమ్ము గట్టిగా లాగి, ఏవిటి సంగతని పక్క వాడ్ని అడిగేడు.

“ఆ యింట్లో ఉన్నావిడ మొగుడ్డూటీ కెల్లిన టయాంలో యెవుడ్తోటో వాగోతం వాడ్తోందట. సాకిరేవెట్టేస్తన్నడు .. ఆడు తెచ్చుకున్న డబ్బులన్నీ తాగేస్తడు. తిండి కోసం ఏఁవేం వాగోతాలాడిందో ...అసలే ఎండ గుండేఁవో, మొర్రెత్తినట్టు వాదేస్తన్నడు.”

రాంబాబు గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది.

“సంపేకురా....” అంటోంది ముసిల్ది. గోడకేసి మనిషి గుద్దుకున్న చప్పుడు. “ఆబోమ్మా” అన్న అరుపు.

రాంబాబుని ఏదో పిరికితనం, భయం, ఆవహించేయి. వెనక్కి తిరిగిపోదామని బైల్దేరాడు.... వెళ్ళబుద్ధికాలేదు.

సుందరమ్మ ...ని ... చంపేస్తాడా?

చంపేస్తే ...తనకీ సుందరమ్మకీ ఉన్న సంబంధం.... ...పోలీసులు ... అనుమానాలు ... కేసులు....‘అమ్మో?’ రాంబాబు గుండె చల్లబడ్డట్టైంది.



చంపడు!

చంపితే వాడి మెడకేగా చుట్టుకునేది?

ఆఁ ఆఁ....అవునవును....అవునవునాఁ ఆఁ ఆ?!

చంపడు!

సుందరమ్మ....తన గురించి చెప్పేస్తుందా?....వొళ్లు జలదరించింది.

చెప్పదు....దానికే తెలీదుకద తనెవరో, ఎక్కడుంటున్నాడో?

తొందరగా ఇక్కడ్నించి వెళిపోతే సరి....వెళ్ళ బుద్ధి వెయ్యలేదు.

ఎవరికీ కనబడనిచోట నక్కని ఆ షెడ్డువేపే చూస్తున్నాడు.

ముసిల్ది తలుపు కొడుతూనే ఉంది ...

కొంతసేపటికి షెడ్డు ముందర మూగిన వాళ్ళంతా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు.

మరో పావు గంటకి షెడ్డు తలుపులు తెరచుకొని సుందరమ్మ మొగుడు బైటికొచ్చాడు. అతని మొహంలో కసి— అలసిపోయి ఉన్నాడు. ఎటో గబగబా నడిచి వెళ్లిపోయేడు.

రాంబాబుకి గుండె వేగంగా కొట్టు

కుంటోంది.

ముసిల్ది షెడ్డులోకి వెళ్లింది.

శవాన్ని చూసి ఆ ముసిల్ది అరిచే అరుపు కోసం, ఏడుపు కూనిరాగాలకోసం ఎదురు చూస్తున్నాడు రాంబాబు.

నిమిషాలు భయంకరంగా గడుస్తున్నాయి.

గుండె చాలా ఆలస్యంగా, చాలా గట్టిగా కొట్టుకుంటోంది.

చెమట పట్టడం మానేసింది.

ఏడుపు లేవీ వినబడలేదు.

ముసిల్ది షెడ్డు తలుపు మూసేసింది.

'సుందరమ్మ చావలేదు!'

ఓసారి చూసొస్తే?....

కాళ్లు అటునడవడానికి ఇష్టపడ లేదు.

"సుందరమ్మ చావలేదు.... ... ...అది మాత్రం ఖాయం'

అలా అనుకుంటే కొంచెం ధైర్యం కలిగిందతనికి. వొచ్చిన్దారినే మళ్ళీ వెనక్కి నడిచేడు.

నడుస్తుండగా ఆ రోజు అతను చూసిన దృశ్యాలు, విన్నమాటలు, శబ్దాలు అతని మస్తిష్కాన్ని గింగుర్లెత్తిస్తున్నాయి. గుడిసెల్లో వాళ్ళ బ్రతుకు లింత అధ్వాన్నంగా, ఇంత భీభత్సంగా ఉంటాయని అతనే నాడూ అనుకోలేదు.

ఆ క్షణంలో అతనికి వాళ్ళకోసం బాధ పడాలనిపిస్తోంది. వాళ్ళ పరిస్థితిని గురించి ఆలోచించాలనిపిస్తోంది.

క్రికెట్‌లో ఆంధ్ర అంత అధ్వాన్నపు పరిస్థితుల్లో ఎందుకుందా అని అతను చాలా సార్లు తీవ్రంగా 'ఆలోచింప' గలిగేడు.

వెంగళప్ప ఎలెవెన్ వాళ్ళ గోల్ కీపరుకి బంతిని పట్టుకోడానికి ఎగరబోయేం తలో కాలు తిమ్మిరెక్కడం, ఆ కారణంగా ఆ టీము ఓడిపోవడం చాలా 'బాధ' కలిగించింది.

క్రికెట్ గురించి ఆలోచించినా, ఫుట్ బాల్ కోసం బాధపడినా అతని కొచ్చే నష్టం ఏంవీ లేదు. సాటి మనిషిని గురించి ఆలోచించడం, బాధపడ్డం అతనికి అలవాటు లేదు. అటువంటి అలవాటు ఉంటే వచ్చే నష్టాల గురించి తెలుసుకునే అనుభవం కూడా లేదు.

అందుకే....అతను వాళ్ళ పరిస్థితుల గురించి ఆలోచించలేక పోతున్నాడు. వాళ్ళ కోసం బాధపడ్డానికి భయపడుతున్నాడు.

* *


దూరంగా మంటలు!
గుడిసెల్లో మంటలు
గుడిసెలపై మంటలు
గుడిసెల్ని మింగేస్తూ మంటలు!

'హరరె!' అనుకుని గబగబా నడిచేడు రాంబాబు.

పేట పేటంతా గోల, గోల!
అరుపులు, ఏడుపులు...

ఒకింట్లో ఒక ఆడమనిషి, ముగ్గురు పిల్లలు బుగ్గై పోయేరు. మరో యింట్లోంచి ఒక ముసిల్ది బైటికి రాలేక కాలిపోయింది.

"ఎంత పన్జేసేవురా బగమంతుడా..."



మండుటెండల్లో — కష్టపడే వాళ్ళ కుటుంబాలకి నిలవనీడలేకుండా చేస్తున్నాడు అగ్ని 'దేవుడు.'

ఫటామని శబ్దం చేస్తూ ఒక ఎండు దూలం దూరంగా విరుచుకు పడింది. ఒక పదేళ్ళ కుర్రాడి మెడమీద పడింది.

"ఓలమ్మో, నానేటి సేసేది తల్లే....మా బతుకులు కాలి మసై పోనాయమ్మో....మా సెంద్రిదాయి పిల్లల్తో కాలి పోనాదమ్మో.... నా నేటి సేసేది భగమంతుడా...." అంటూ శోకాలు పెడుతోందొకామె.

అసలెలా అంటుకున్నాయి? అన్న ప్రశ్న లేచింది.

"ఎవులో సిగిరెట్టిసిరేస్తే కమ్మరేకుల మీద పడిందంటండీ. ఆ కమ్మలంటుకోడం చూసి ఓ కుర్రాడు ఆ యింటోళ్ళని లేపి సంగచ్చెప్పేనోపుగానే ...ఎండుకమ్మలూసాదండి, గబగబా సుట్టూతా మంటలల్లుకు పోనాయి. ఆర్పనంది కెక్కడా నీటి సుక్కేనేదండి" అన్నాడొకడు.

"పొద్దుట్నించీ కొళాయిల్రాందే. నీల్లెక్కణ్ణించొస్తాయి? యిళ్ళు దెగ్గిరెగ్గిరున్నాయేమో, యెంటెంటనే అంటుకు పోతన్నాయి."

"ఫైరాఫీసుకి ఫోను చెయ్యలేదాండి?"

రాంబాబు గుండెలదుర్తున్నాయి. సిగరెట్టు నిర్లక్ష్యంగా విసిరేసిన సంగతి అతనికి జ్ఞాపకం వచ్చింది.

"పోన్లయ్యా దెగ్గిరా, దాపలా? మాలాంటోళ్ళని పోన్లో మాటాణ్ణిస్తారా. ఎయ్యి ప్రెశ్నలేస్తారు....అయినా ఎవులో కుర్రోళ్ళెల్లేరెండి."

మంటలు....ఛటా ఫట్....ఫెళఫెళలు, రోదనలు....

సిగరెట్టు....సిగరెట్టు .... మంటలు.... సిగరెట్టు....ఇళ్ళు కాలుతోన్న శబ్దాలు రాంబాబు తల తిరిగిపోతోంది.

చిన్న నిర్లక్ష్యానికి....అదీ తెలిసి చెయ్యా



లేదు. ఇలా జరుగుతుందనుకోలేదు.

అయినా తప్పు చేసేనన్న ఫీలింగు ఉధృతమౌతోంది. పెద్ద తప్పుగా కళ్ళక్కనిపించకపోయినా....మనసుకి తెలుస్తోంది.


కళ్ళక్కనిపించకుండానే 'కనిపిస్తున్న' తప్పు చూసుకునే బెంబేలెత్తి పోతున్నాడు రాంబాబు. ఆ మాత్రంగా కూడా 'కనిపించని' తప్పులెన్నో, ఆ తప్పుల ఫలితంగా రగుల్తున్న మంటలెన్నో, కృత్రిమంగా కొందరు వొంటికి రాసుకున్న సంస్కారపు బూడిద ఏదో ...అతనికింకా తెలీదు.

వెర్రి ఆవేశం వచ్చింది.

ఏదో చేసేయాలనే తపన....వొంటి నంటుకున్న మురికిలాంటి 'తప్పుని' తుడిచేసుకోవాలనే ఆ కాంక్ష....

యిళ్ళ మంటల్లోకి దూకేడు.

ఆడవాళ్ళని, పిల్లల్ని ఒకచోట చేర్చడంలో సహాయపడ్డాడు. నలుగుర్ని కూడ




గట్టుకుని దారిలో పడ్డ కుర్రలని, కమ్మ రేకుల్ని దూరంగా తొలగించేడు. ఇంకా అంటుకోని పాకల మీదనించి కమ్మలు పీకేయడానికి సహాయపడ్డాడు.

అంతటా తానే అయి అందరికీ ఎన్నో విధాల సహాయపడ్డాడు.

ఆ సమయంలో కూడా 'సదుంకుం టున్న మా రాజు', 'దరిద్ర గొట్టోళ్ళ' పాక ల్లోకి ప్రవేశించి వాళ్ళకి సహాయపడ్డందుకు కొందరు ఆశ్చర్యం ప్రకటించేరు.

ఓ డెభై యిళ్ళదాకా కాలేసరికి పైరింజ న్లొచ్చేయి. మరో పదిళ్ళు కూడా కాలేసరికి నెమ్మదిగా మంటలారేయి.

అతని పరిచర్యలు పొందిన వాళ్లు కొందరు అతను 'సల్లగుండా'లని దీవించేరు. అతను వింటూండగా అతని వెనకాల కొందరు 'ప్రేక్షకులు' అతన్ని గురించి చెప్పుకున్నారు.

రాంబాబు మనసు ఆనందంతో నిండి పోయింది. చేసిన తప్పుని 'సరిచేసుకున్నా' నన్న తృప్తి పొందేడు. వాళ్ళ పొగడ్తలకి దీవెనలకి పొంగిపోయేడు.

కాలిన యిళ్ళని, మనుషుల్ని అప్పుడే మర్చిపోతున్నాడు. పొగడ్తలు, దీవెనలు చెవుల్లో గింగుర్లెత్తి గుండెల్లో లయ బద్ధంగా నాట్యం చేస్తున్నాయి. మధురాతి మధురమైన సంగీతం అతనికి లోపల్నించి వినవస్తోంది. ఎలక్ట్రిక్ బల్బులాగ వెలిగి పోతోంది మొహం ఆనందంతో....

'అపుడే ఏదో గొప్ప ప్రజాసేవ చేసేసి నట్టు, త్యాగం చేసినట్టు....ఇంకా ముందు ముందు చేసే 'ప్రజాసేవ', తత్ఫలితంగా వచ్చే పొగడ్తలు, దీవెనలు....ప్రజానాయకుడు.... ప్రజలకి దేవుడు....దీనబంధుకీ జై జై జై జై....' ఈ ఊహల్లో కొట్టుకుపోతుం డగానే మెయిన్ రోడ్డుమీది కొచ్చేడు.

సైకిళ్ళు, కార్లు, బస్సులు....స్నేహి తులు, ఆడవాళ్ళు .తెలిసిన పెద్ద మను

షులు....ఎందరో, ఎందరో.

*　　　*

పేంటు, చొక్కా బాగా నలిగిపోయి, మొహంనిండా, బట్టల్నిండా దుమ్ము, ధూళి, మసి అంటుకుపోయి, మొహం వేలాడేసుకుని నీరసంగా నడచివొస్తున్న రాంబాబుని చూసి అతని స్నేహితులు ఎగతాళిపట్టించేరు.

"ఏఁవిట్రోయ్, ఆ అవతారం? అంట్ల వెధవలాగ!"

"పటాష్ మీదున్నట్టున్నాడ్రోయ్, ఏట్నింగచ్చేపామ్మ?"

"పటాష్ మీదుంటే ఆ దుమ్ము, మసి ఏఁవిటోయ్?"

"నా అనుమానం,—వాడు బొగ్గులడితీ దానితో ఇంతసేపూ సరసాలాడి వొస్తున్నాడని."

"మొత్తానికి బొగ్గు గనిలో పన్చేసే వోళ్ళాగున్నాడ్రా, ఆడూ, ఆడి మొహఁవూనూ!"

స్నేహితుల మాటలకి కించిత్ కించపడ్డాడు దీనబంధు. కాని, అంతలోనే ఉత్సాహం కలిగింది.

యిళ్ళంటుకోడం, తను చేసిన సేవ, వాళ్ళ పౌగడ్తలు (ఉన్నవాటిని పదింతలు చేసి) అన్నీ వివరంగా చెప్పేడు.

అంతా విని స్నేహితులు హేళనగా నవ్వేరు.

"గాంధీగారు మళ్ళా పుట్టేరేఁవిటి?"

" 'చచ్చి' నోళ్ళు మళ్ళీ పుడతారేటి గురూ, మనోడిక్కొంచెం స్క్రూలూజైందంతే!"

"తాగ్రేకు టపాకాయ కాల్చలేనోడు ఆ మంటల్లో కెళ్ళేడంటే నేన్నమ్మను గురూ."

"ఊరివాళ్ళ మంటలార్పేవాడెవడు బాగుపడ్డాడోయ్."

"ఉండండ్రా, మీరు మరీని....మనవాడేదో సాంఘికసేవ చేసొస్తే వాడి నూరికే ఊదరబెట్టేస్తారేంటి?"

"ఒరేయ్, మనోడు దీనబంధువైపోయేడ్రా. దీనబంధువు లెప్పుడూ బాగుపడాలనుకోరు. అంచేత వాడింకిస్కీలు, బ్రాందీలు తాగడు. మనలాంటి దీనుల కిప్పిస్తాడంతే."

"దీనబంధువుల్ని, సాంగీక సేవకుల్ని ఎంత మందిని చూళ్ళేదురా మనం....అలా చూస్తుండగానే ఆడు మినిష్టరైపోతే నా పేరే కాదు."

"నాలుగు మంచి పన్లు చేస్తే మనకి నష్టమేం ఉండదు. కాని, ఆ చేసేదేదో మన హోదాకి, గౌరవానికి సరిపోయేట్టుండాలి. ఓ ఫంక్షనూ, పార్టీ ఏర్పాటుచేసి, పర్సు ప్రజంటటు చేసి ఫొటో తీయించుకుని పేపర్లో వేయించుకుంటే దర్జాగా ఉంటుంది. మరీ అలగా వాళ్ళ స్థాయికి దిగజారిపోకూడదు. స్టేటస్ మెంటేన్ చెయ్యాలండీ!"

రాంబాబు తలొంచుకున్నాడు. ఒక్కసారిగా సిగ్గు, అవమానం అతన్ని కృంగదీసేయి. కళ్ళంట నీళ్ళొచ్చేయి!

———